

కూష్మాండ దుర్గ అలంకారంలో భ్రమరాంబదేవి

దేవీ వైభవం

- కూష్మాండ దుర్గగా భ్రమరాంబికా మాత
- కైలాస వాహనంపై విహరించిన శివపార్వతులు
- శ్రీగిరిలో వైభవంగా దసరా ఉత్సవాలు

శ్రీశైలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దేవీ శరన్నవ రాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం భ్రమరాంబికా దేవి కూష్మాండ దుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అదేవిధంగా కుమారిపూజను నిర్వహించారు. రెండు నుంచి పదేళ్ల లోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించారు. దేవీ అవతారాల్లో కూష్మాండ దుర్గ సాత్విక రూపంలో సింహవాహనాన్ని అధిష్ఠించి ఎనిమిది చేతులతో దర్శనమిస్తారు. కుడివైపు పద్మం, ధనస్సు, బాణం, కమండలం, ఎడమవైపు చక్రం, గద, జపమాల, అమృత కలశాన్ని చేపట్టి అమ్మవారు దర్శనమిచ్చారు. కూష్మాండ దుర్గ అలంకరణలో అమ్మవారిని పూజించడంతో సర్వ రోగాలు తొలగిపోయి ఆరోగ్యం, ఆయుష్షు, యశస్సు వృద్ధి చెందుతాయని భక్తుల విశ్వాసం. అదేవిధంగా సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారు కైలాస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో అర్చకులు కూష్మాండ దుర్గ సమేతుడైన మల్లన్న స్వామికి అర్చనలు, ప్రత్యేక హారతులు నిర్వహించారు.





క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కైలాస వాహనంపై శివపార్వతులు విహరిస్తూ గంగాధర మండపం నుంచి నంది మండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవం ఎదుట కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోయ నృత్యం, కన్నడ జానపద, నాదస్వరం, కేరళ చండీ, ఢమరుకం, కోలాటం, రాజభటుల వేషాలు, అమ్మవారి వేషం, డోలు విన్యాసం, వివిధ కళారూపాలు భక్తులను అలరించాయి. ఈ ఉత్సవాన్ని ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాయంత్రం ఒంగోలుకు చెందిన పొన్నూరు వెంకట శ్రీనివాసులు ఆధ్యాత్మిక ప్రవచనం, వై.జయకృష్ణభాగవతార్ హరికథా కాలక్షేపం నిర్వహించారు.

నేడు స్కందమాతగా అమ్మవారు

దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం భ్రమరాంబికా దేవి స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవారికి శేష వాహనసేవ నిర్వహిస్తారు.



క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం



కోలాటం ఆడుతున్న మహిళలు



ఆళ్లగడ్డ లోని టిడ్కో గృహాలు

టిడ్కోలో వైసీపీ పాగా

- పేదలకు అందని పట్టాలు
- నాయకులు, కార్యకర్తల్లో లబ్ధిదారులు
- వందల సంఖ్యలో అనర్హులు
- నోటీసులిస్తున్న మున్సిపల్ అధికారులు
- నేటికీ పూరి గుడిసెల్లోనే పేదలు

పేదలందరికీ సొంతిల్లు ఉండాలన్నదే టీడీపీ లక్ష్యం.. గతంలో అధికారంలో ఉన్నప్పుడు టిడ్కో గృహాలకు పునాదులు వేసింది.. అంతలోనే ఎన్నికలొచ్చాయి.. టీడీపీ అధికారం కోల్పోగా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అంతే టిడ్కో గృహాలు ఆ పార్టీ నాయకుల చేతుల్లో వెళ్లిపోయాయి. వారి ఇష్టానుసారంగా ఇళ్లను పంపిణీ చేశారు. తమ పార్టీకి చెందిన కార్యకర్తలు, బంధుమిత్రులకే ప్రాధాన్యం ఇచ్చారు. అసలైన పేదలను పక్కన పెట్టారు. దీంతో నేటికీ పేదలు పూరి గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. దీంతో ఆపార్టీకి చెందిన నాయకులు టిడ్కో గృహాల్లో పాగా వేశారు. ధనికులు, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నవారికి ఇంటి స్థలాలివ్వడం చర్చనీయాంశంగా మారింది. పేదలకు ఇవ్వకుండా వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా పట్టాలు పంపిణీ చేశారు. తమ కార్యకర్తలకు, అనుచరులకు కట్టబెట్టారు. అసలైన లబ్ధిదారులు నేటికీ పూరి గుడిసెల్లోనే నివాసాలు ఉంటున్నారు.

గత టీడీపీ హయాంలో..

ఆళ్లగడ్డలోని చింతకుంట రస్తాలో ఏడేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.72.63 కోట్లతో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి పునాది వేశారు. అంతలోనే ఎన్నికలు రాగా వైసీపీ అధికారంలోకి వచ్చింది. 1,392గృహాలను నిర్మించారు. ఇష్టారాజ్యంగా లబ్ధిదారులను ఎంపిక చేసి గృహ ప్రవేశాలు చేయించారు. ఇందులో సగానికి పైగా అనర్హులు ఉండటం గమనార్హం. వీటిలో నలభైశాతం ఇళ్లకు ఏళ్లతరబడి తాళాలు వేసి ఉన్నాయి.



చాగలమర్రి లోని మల్లేవేముల రస్తాలో ఇంటి నిర్మాణ సముదాయం

ఇతర ప్రాంతాలకు చెందిన వారు

ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు కూడా గృహాలు తీసుకొని తాళాలు వేసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. కొంత మంది ఐదు నుంచి 10 గృహాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవలే టిడ్కో గృహాల్లో మున్సిపల్, పోలీసు అధికారులు కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు తాళాలు వేసి ఉన్నవారికి నోటీసులు జారీ చేసినా ఫలితం లేకుండాపోయింది.

ఇళ్లను ఎలా రద్దు చేస్తారో..

మూడు నోటీసులకు జవాబు ఇవ్వకుంటే ఇంటిని రద్దు చేస్తామని మున్సిపల్ అధికారులు చెబుతుండగా ఎలా చేస్తారో చూస్తాం అని ఓ వర్గం వారు అధికారులనే బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఈ గృహాలపై అధికారుల ఆజమాయిషీ లేకపోవడంతో అక్రమార్కుల ఇష్టారాజ్యంగా మారింది. గృహాలను క్రయ విక్రయాలు కూడా సాగిస్తున్నారు. ఇటీవల ఒక ఆర్ఎంపీ వైద్యుడు రెండు గృహాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నట్లు విమర్శలున్నాయి.

రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నా..



రెండు సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. సొంత ఇల్లు లేక పూరి గుడిసెలోనే ఏళ్లతరబడి నివాసం ఉంటున్నా. కూటమి ప్రభుత్వం తమకు ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరుతున్నా.

- లక్ష్మీదేవి, సద్దాం కాలనీ, ఆళ్లగడ్డ

అర్హులందరికీ ఇంటి స్థలాలు..



కాలనీలో చాలా మందికి ఇళ్లు లేవు. అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలి. పదేళ్లకు పైగా గుడిసెల్లోనే నివాసముంటున్నాం. గతం ఎన్నో సార్లు ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నాం. అయినా మంజూరు కాలేదు.

- హరి, సద్దాం కాలనీ, ఆళ్లగడ్డ

రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు..

లబ్ధిదారులు ఈ స్థల పట్టాలను రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఇతరులకు విక్రయించారు. ఉద్యోగులు, బంధువులు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నవారికి సైతం స్థలాల పట్టాలను ఇచ్చారు. నిజమైన పేదలు ఇంకా పూరి గుడిసెల్లోనే మగ్గుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని అమ్మినా, కొన్నా తగు చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం ఇటీవల సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని త్వరగా అమలు చేసి అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేదలు కోరుతున్నారు.

ఇళ్ల స్థలాల్లో నాయకుల చేతివాటం..

గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో తాలుకాలోని పలు మండలాల్లో భూమి కొనుగోలు చేసి స్థలాల పట్టాలను పంపిణీ చేయాలనుకుంది. అంతలోనే ప్రభుత్వం మారిపోయింది. దీంతో ఇందులో కూడా వైసీపీ నాయకులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. చాగలమర్రిలోని నారాయణపల్లె రస్తాలో ఏడెకరాల్లో 300, మల్లెవేముల రస్తాలో 13 ఎకరాలలో 400, కూలూరు రస్తాలో 10.5 ఎకరాలలో 300, గుంతపాలంలో ఏడెకరాల్లో 250 పట్టాల కోసం భూమిని కొన్నారు. చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు, బ్రాహ్మణపల్లె, మద్దురు, నేలంపాడుతో పాటు మేజర్ గ్రామ పంచాయతీ చాగలమర్రిలో పట్టాలు పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చి పట్టాలు అందజేశారు.



కొనసాగుతున్న నీటి విడుదల

- శ్రీశైలం నీటి మట్టం 881 అడుగులు

శ్రీశైలం,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. రిజర్వాయర్‌కు ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి, సుంకేసుల, హంద్రీ 2,66,212 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి. శ్రీశైలం 10 క్రస్ట్‌గేట్ల గుండా 2,66,060 క్యూసెక్కులు సాగర్‌కు సాగనంపుతున్నారు. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 65,341 క్యూసెక్కులు విడుదల చేశారు. శ్రీశైలం డ్యాం నీటిమట్టం గురువారం సాయంత్రం 6గంటల సమయానికి 881 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 197 టీఎంసీలుగా నమోదైంది.

టమోరా

- పడిపోయిన ధరలు
- కిలో రూ.2 మాత్రమే

ప్యాపిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ప్యాపిలి మార్కెట్లో గురువారం టమోటా కిలో ధర కేవలం రూ.2 మాత్రమే పలికింది. మూడు రోజులుగా వర్షాలు పడుతుండటంతో రైతులు టమోటాలను కోయలేదు. గురువారం వర్షం నిలిచిపోవడంతో మార్కెట్‌కు టమోటాలను రైతులు అధికంగా తరలించారు. దీంతో ధరలు పూర్తిగా పడిపోయాయి. 25 కిలోల బాక్సు రూ.50 నుంచి రూ.70మించి పలకలేదు. రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యాపారుల కమీషన్ పోగా తమకు రవాణా చార్జీలు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి టమోటాకు పెట్టుబడులు పెట్టామని ధరలు ఇలా ఉంటే అప్పులు ఎలా తీర్చుకోవాలని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు కోరుతున్నారు.



ప్యాపిలిలో మార్కెట్‌కు తరలించిన టమోటాలు

నేరాలను అదుపులోకి తీసుకువస్తాం : ఎస్పీ

శ్రీశైలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో నేరాలను అదుపులోకి తీసుకు వస్తామని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. గురువారం సున్నిపెంట, శ్రీశైలం పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ముందుగా ఆయన భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. క్షేత్రంలోని కమాండ్ కంట్రోల్ రూం, క్యూలైన్లు, వీఐపీ అతిథి గృహం, రింగ్ రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. శ్రీశైలంలోని రెండు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా శ్రీశైలం రిజర్వాయర్‌ను సందర్శించారు. సున్నిపెంట పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. సున్నిపెంటలో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. శ్రీశైలం మహాక్షేత్రంలో భద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎస్పీ వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐలు ప్రసాదరావు, చంద్రబాబు, ఎస్ఐలు ఉన్నారు.



స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి

- కలెక్టర్ రాజకుమారి



హాస్టల్ గదిని శుభ్రం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ రాజకుమారి వసతిగృహ నిర్వాహకులకు ఆదేశించారు. 'ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛతా' కార్యక్రమంలో భాగంగా దేవనగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలురవసతి గృహంలో నిర్వహించిన శ్రమదానంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

సీపీఐ జాతీయ కార్యదర్శిగా రామకృష్ణ



ఆలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శిగా కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామ వాసి కె.రామకృష్ణ నియమితులయ్యారు. ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన 25వ సీపీఐ జాతీయ సభల్లో ఆయనను నియమించారు. మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ విద్యార్థి దశ నుంచే ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా, సీపీఐలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. అనంతపురం జిల్లాలో సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి జాతీయస్థాయిలో గుర్తింపు ఇచ్చారు. జాతీయ కార్యదర్శిగా నియామకమైన రామకృష్ణ 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. జాతీయ స్థాయిలో గుర్తింపు ఇచ్చి కార్యదర్శిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శిగా రామకృష్ణ నియామకంపై ఆయన స్వగ్రామమైన మొలగవల్లిలో బంధువులు, మిత్రులు, సీపీఐ, తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, ఆలూరు సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, ఆలూరు తాలూకా ఏఐటీయూసీ అధ్యక్షుడు రంగన్న రామకృష్ణకు అభినందనలు తెలిపారు.

యువకుడిపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

ఆదోని, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిపై దాడి నేపథ్యంలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణానికి చెందిన ఓ యువకుడు సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఫొటోను వరాహం ఆకారంలో మార్ఫింగ్ చేశాడు. ఆ యువకుడిని ఓ ఆలయానికి తీసుకెళ్లి క్షమాపణలు చెప్పించడమేగాకుండా పూజ చేయించి ఆ వ్యక్తిపై ఆరుగురు యువకులు దాడి చేశారు. బాధిత యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరూ కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకుని రెచ్చగొట్టే విధంగా వ్యవహరించొద్దని ఆయన సూచించారు.

బేడ, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే కోట్ల



డోన్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. బేడ బుడగ జంగాల కమిటీ 1976 నుంచి ఏపీలో షెడ్యూల్ కులంగా గుర్తింపు పొందిందన్నారు. 2022లో జరిగిన సవరణ వల్ల వారి ఎస్సీ జాబితా హోదా కేవలం తెలంగాణకే పరిమితమైందని పేర్కొన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో ఉన్న బేడగ బుడగ జంగాల కమిటీని ఎస్సీ జాబితా నుంచి తప్పించారన్నారు. ఈ కమిటీకి విద్య, ఉపాధి సంక్షేమ పథకాలు వంటి బేడ బుడగ జంగాలు అనేక రకాల ప్రయోజనాలకు దూరమయ్యారని ప్రస్తావించారు. తిరిగి ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అసెంబ్లీలో కోరారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

- జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు



ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించి బీజేపీని మరింత బలోపేతం చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు పక్షోత్సవాల్లో భాగంగా డోన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం కొందరు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో కిరణ్, సుధాకర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, ప్రసాద్‌గౌడు, గీతామాధురి, తదితరులు పాల్గొన్నారు.

- పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బీజేపీ కార్యాలయంయలో బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి, రామయ్య, వెంకటేశ్వర్లు, చలపతిరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. నాగార్జున, హెచ్‌కే హరినాయుడు, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో ముంచారు

- ఒక్కొక్క మొక్కకు ఐదు కంకులు
- రోడ్డెక్కిన మొక్కజొన్న రైతులు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

మొక్కజొన్న సాగు కోసం లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టారు. ఎంతో విశ్వాసంతో విత్తనాలు కొనుగోలు చేశారు. ధనార్జనే ధ్యేయంగా కొన్ని దుకాణాలు రైతులను నిలువునా ముంచాయి. నకిలీ విత్తనాలతో రైతులు నట్టేట మునిగిపోతున్నారు. నిత్యం పత్తి, మిరప రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయేవారు. ఇప్పుడు మొక్కజొన్న రైతు కూడా వారి సరసన చేరారు. నకిలీ విత్తనాలు ఇచ్చి తమను మోసం చేశారంటూ నందికొట్కూరు రైతులు రోడ్డెక్కారు. ఆయా కంపెనీలు, దుకాణాలపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



రోడ్డుపై బైఠాయించిన రైతులు

నందికొట్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎంతో నమ్మకంతో మొక్కజొన్న విత్తనాలను కొనుగోలుచేసిన రైతులను కొన్ని దుకాణాలు నకిలీలతో నిలువునా ముంచాయి. గురువారం నందికొట్కూరు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పట్టణంలోని ర్యాలీ నిర్వహించి, పటేల్ సెంటర్‌లో బైఠాయించి రాస్తారోకో చేశారు. రైతులు చేపట్టిన ఆందోళనకి వామపక్ష పార్టీల నాయకులు నరసింహులు, రఘురాంమూర్తి, నాగేశ్వర రావు, పక్కీర్‌సాహెబ్, వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. రైతుసంఘం నాయకుడు రవి శెట్టి మాట్లాడుతూ జూన్, జూలై నెలల్లో శ్రీపల్లవి హైబ్రిడ్ సీడ్స్, శ్రీవెంకటేశ్వర విత్తనాల దుకాణంలో జిల్135, మరికొన్ని దుకాణాల్లో కార్గిల్ 9133 రకం విత్తనాలను రైతులు కొనుగోలు చేశారన్నారు. ఈ విత్తనాలతో ఒక్క నందికొట్కూరులోనే 500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు తెలిపారు. ఖరీఫ్ ప్రారంభంలోనే విత్తనాలను నాటామని సరైన వర్షాలు కురవడంతో దిగుబడుగులు ఆశాజనకంగా ఉంటాయనుకుంటే ఒక్కొక్క మొక్కకు ఐదు కంకులొచ్చాయని, అందులో ఏఒక్క కంకికి కూడా విత్తనాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. నకిలీ విత్తనాలు అందజేసిన దుకాణం, కంపెనీలపై చర్యలు తీసుకోవాలని పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చంద్రశేఖర్ ఏవో షేక్షావలిని పిలిపించి పొలాలను పరిశీలించారు.



పొలం పరిశీలన

పదేపదే మోసం చేస్తున్నా..

శ్రీపల్లవి హైబ్రిడ్ దుకాణం నకిలీ విత్తనాలను అందజేస్తూ తమను పదేపదే మోసం చేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా వరి, మినుములు, మిరప, మొక్కజొన్న నకిలీ విత్తనాలను కొనుగోలుచేసి మోసపోయామని రైతులు పలుమార్లు ఫిర్యాదులు చేసిన దాఖలాలున్నాయి. జిల్ 135 కంపెనీ డీలర్‌షిప్ ఉన్నది వెంకటేశ్వర విత్తనాల దుకాణానికి ఉండగా శ్రీపల్లవి హైబ్రిడ్ దుఖాణంలో కూడా ఇదే కంపెనీ విత్తనాలను రైతులకు అమ్మడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ షాపుపై వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యమేమిటో తెలియడం లేదు.



4 లక్షలు పెట్టుబడి పెట్టా

పది ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నా. జిల్ 135రకం మొక్కజొన్న విత్తనాలు నాటా. మొత్తం 10ఎకరాలకు రూ.4లక్షలు ఖర్చు చేశా. ఒక్కొక్క చెట్టుకు నాలుగు, ఐదు కంకులు వచ్చాయి. ఈ విత్తనంతో పూర్తిగా నష్టపోయా.
● **ఉశేనమ్మ, రైతు, నందికొట్కూరు**

70 ఎకరాల్లో మొక్కజొన్న సాగు



70 ఎకరాలను కౌలుకు తీసుకొని కార్గిల్ 9133, జిల్ 135 రకం మొక్కజొన్న విత్తనాలను సాగుచేశా. కౌలు ఎకరాకు 18 వేలు. రూ.25లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టాను. కంకులకు విత్తనాలు లేవు. అప్పుల ఊబిలో కూరుకుపోయా. ప్రభుత్వం న్యాయం చేయాలి. ● **మౌలాలి, నందికొట్కూరు**

రైతులకు న్యాయం జరిగేలా చూస్తా

రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. విత్తనాల దుకాణాల యజమానుల ద్వారా కంపెనీలను ఇక్కడికి పిలిపిస్తాం. రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం. ● **షేక్షావలి, ఏవో, నందికొట్కూరు**

టెక్నాలజీని వినియోగించుకోండి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- ప్రతిభ కనబర్చినవారికి ప్రశంసాపత్రాలు

కర్నూలు క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేసుల ఛేదనకు టెక్నాలజీని వినియోగించుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. ప్రతి సబ్ డివి జన్‌కు ఒక డాగ్ స్క్వాడ్, క్యూజ్ టీమ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి కేసు వివరాలు ఎప్పటికప్పుడూ సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 29 నుంచి అక్టోబరు 26 వరకు నాలుగు వారాల పాటు రోడ్డు భద్రతపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గత నెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, భార్గవి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



హాళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- ఓజీ సినిమాకు వెళ్తుండగా ప్రమాదం



బోయ మోహన్(ఫైల్)

గోనెగండ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగందిన్నె క్రాస్ రోడ్డు దగ్గర గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మాచాపురం గ్రామానికి చెందిన బోయ మోహన్(33) అనే యువకుడు మృతి చెందాడు. అలాగే చాకలి శ్రీరాములు అనే వ్యక్తి కి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. దేవనకొండ మండలం మాచాపురం గ్రామానికి చెందిన బోయ మోహన్, చాకలి శ్రీరాములు స్నేహితులు. అయితే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమా బెనిఫిట్ షోను చూసేందుకు ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి ఇద్దరు కలిసి కోడుమూరుకు వెళ్లారు. రాత్రి సినిమాను చూసి మాచాపురం గ్రామానికి వెళ్లారు. అయితే గురువారం తెల్లవారుజామున మరో సారి ఓజీ సినిమాను చేసేందుకు మోహన్, శ్రీరాములు కోడుమూరుకు దిచక్రవాహనంపై వెళ్తుండగా లింగిందిన్నె క్రాస్ రోడ్డు దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బోయ మోహన్ అక్కడికక్కడే మృతి చెందగా శ్రీరాములుకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీరాములుని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మోహన్ భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థుల గల్లంతు

- కేసీ కెనాల్‌లో ఇద్దరు, నూతనపల్లెలో మరొకరు



అశోక్



ప్రశాంత్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసీ కెనాల్‌లో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. వివరాల మేరకు.. వాసవి నగర్ ఎస్ఏపీ క్యాంప్‌కు చెందిన వడ్డె అశోక్ (13), సీతారామనగర్‌కు చెందిన కొమ్ము ప్రశాంత్ (12) వినాయక ఘాట్ సమీపంలోని కేసీ కెనాల్‌కు వచ్చారు. స్నేహితులతో కలసి సాయంత్రం ఈత కోసం కేసీలో దిగారు. అయితే ఈత రాక నీటిలో మునిగి కొట్టుకుపోయారు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. విద్యార్థుల బంధువులు, తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు, తల్లిదండ్రులు కేసీ కెనాల్‌లో గురువారం రాత్రి వరకు గాలించినా ప్రయోజనం లేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు. అశోక్ 9వ తరగతి, ప్రశాంత్ 7వ తరగతి ఎస్ఏపీ క్యాంప్ పాఠశాలలో చదువుతున్నారు.

- మరో ప్రమాదంలో తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో నూతనపల్లె గ్రామంలో శ్రీనివాసులు (16) అనే విద్యార్థి బావిలో పడి మృతి చెందాడు. శ్రీనివాసులు తల్లిదండ్రులు పనికి వెళ్లారు. శ్రీనివాసులు అవ్వ వద్దనే ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి బావిలో ఈతకు వెళ్లాడు. ఈత రాక మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

కేసీ కెనాల్‌లో మృతదేహం లభ్యం

పాములపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనకచెర్ల హెడ్‌రెగ్యులేటర్ సమీపంలోని పవర్‌హౌస్ వద్ద కేసీ కెనాల్‌లో అజూరు హుస్సేన్ (25) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం పాములపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కర్నూలులోని చిత్తారివీధికి చెందిన అజూర్ హుస్సేన్ కనబడటం లేదని కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 18న ఆయన తండ్రి షేక్షావలి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చాపిరేవులలో బంగారం చోరీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు తాలుకా పోలీసులు గురువారం తెలిపారు. తాలుకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చాపిరేవుల్లోని దూదేకుల బాలుడు ఉదయం కూలి పనులకు వెళ్లాడు. ఈ విషయం గమనించిన దుండగులు ఇంట్లోకి వెళ్లి ఆరు తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

బకాయిల భారం మోయలేం

- కలెక్టర్‌కు డిగ్రీ కళాశాల యాజమాన్యాల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలలకు చెల్లించాల్సిన రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజులు(ఆర్టీఎఫ్)పెద్ద మొత్తంలో పెండింగ్‌లో పడ్డాయి. ఈబకాయిల భారం ఇక మోయలేమని కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసి కళాశాలలు విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు కోట్లలో ఉండటంతో కళాశాలల నిర్వహణతో పాటు ఉపాధ్యాయుల జీతాలు, ఇతర ఖర్చులు భరించలేకపోతున్నామని యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. ప్రభుత్వ విభాగాలు సేవా ఛార్జీలు, పన్నులు నిరంతరంగా వసూలు చేయడంతో కళాశాలలపై భరించలేని భారం పడుతోందని ఆందోళన చెందుతున్నాయి. గురువారం కర్నూలు కలెక్టర్ సిరిని ఆమె చాంబర్‌లో ఉమ్మడి జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కలిశాయి. పెండింగ్ బకాయిలు వెంటనే కళాశాలలకు అందేలా చూడాలని కోరారు. ఏపీపీడీసీఎం అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటర్ రమేష్, ఈసీ మెంబర్ వంశీ రఘుకుమార్, మనోజ్ కు మార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దసరా సెలవుల తర్వాత సమ్మెకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వానికి జిల్లాలోని పరిస్థితిని వివరించాలని వారు కలెక్టర్‌ను కోరారు.



కె.నాగలాపురంలో కాత్యాయని అలంకరణలో సుంకులాపరమేశ్వరీ అమ్మవారు



కూష్మాండ మాత అలంకారంలో నందవరం చౌడేశ్వరీమాత



చాగలమర్రిలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



గీతామందిరంలో మూల చండిక దేవిగా అమ్మవారు

వివిధ రూపాల్లో అమ్మవారు

కర్నూలు కల్చరల్/ మహానంది/ బనగానపల్లె/ మంత్రాలయం/ గూడూరు/ బేతంచెర్ల/ చాగలమర్రి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నాలుగో రోజు గురువారం దేవీ శరన్నవరాత్రుల శోభ సంతరించుకుంది. మించిన్ బజార్‌లోని పెద్ద అమ్మవారిశాలలో అమ్మవారు వారాహి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూలబజార్‌లోని చిన్న అమ్మవారిశాలలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. వన్‌టౌన్‌లోని కాళికాంబ మాత కాత్యాయని దేవిగా, పాతనగరంలోని గీతామందిరంలోని అమ్మవారు మూల చండిక దేవిగా, కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి రాజ రాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు. చిత్తారివీధిలోని నిమిషాంబ ఆలయంలో అమ్మవారికి మహాలక్ష్మిదేవి అలంకరణ చేశారు.

మహానంది క్షేత్రంలో సాయంత్రం అమ్మవారు కూష్మాండ దుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సింహ వాహనంపై క్షేత్రవీదుల్లో విహరించారు. బనగానపల్లె మండలం నందవరంలో చౌడేశ్వరీ అమ్మవారు కూష్మాండమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గూడూరు మండలం కె.నాగలాపురంలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు గురువారం కాత్యాయణి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ శాకాంబరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల క్షేత్రంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చాగలమర్రి మండలంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



మహానందిలో సింహ వాహనంపై గ్రామోత్సవం

జాబితాపై నిశిత పరిశీలన అవసరం



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బూత్ లెవెల్ అధికారులకు ఓటర్ల జాబితాలోని మార్పులు, చేర్పులపై నిశిత పరిశీలన అవసరమని మున్సిపల్ కమిషనర్ శేషన్న సూచించారు. గురువారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో పట్టణ, రూరల్, శ్రీనివాసులు, శ్రీవాణిల ఆధ్వర్యంలో నంద్యాల నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ఓటరు జాబితాలో కచ్చితమైన పరిశీలన చేసినప్పుడే తప్పులు ఉండవన్నారు. అక్షరదోషాలను గ్రహించి సవరించాలన్నారు. మృతుల వివరాలను గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు శేఖర్, డిప్యూటీ తహసీల్దారు రామచంద్రయ్య, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో ఉమర్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ కార్మికులకు ప్రతినెలా వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. 26 నెలల పాటు వేతన బకాయిలు ఉండటం అన్యాయమన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులు వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పని గంటల పెంపును విరమించుకోవాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పనిగంటల పెంపును రద్దు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. గురు వారం స్థానిక గౌడ్‌సెంటర్‌లో కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. 8గంటల పని దినాన్ని 13 గంటలకు మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే ఇలాంటి నిర్ణయాలను ప్రభుత్వాలు తీసుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాబాషా, హుసేన్‌బాషా, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

ఆత్మకూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎంఈవో అయూబ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దసరా సం దర్భంగా సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిందన్నారు. అయితే కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు స్పెషల్ క్లాస్‌ల పేరిట విద్యార్థులకు మానసిక ఒత్తిళ్లకు గురిచేయడం సరికాదన్నారు. అలాంటి పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు సాయి, ప్రశాంత్, లక్ష్మణ్‌నాయక్, లక్ష్మీనరసింహ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

మహానంది, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మద్దిలేటిని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి పరామర్శించారు. గురువారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మహానంది మండలం మసీదు పురం గ్రామానికి చెందిన మద్దిలేటి ఆరోగ్యం గురించి ఆయన తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. అలాగే వైద్య ఖర్చుల కోసం కొంత నగదును అందజేసినట్లు తెలిపారు.

మంచికి మారుపేరు భాగ్యమ్మ



భాగ్యమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పగిడ్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచికి మారుపేరు బండి భాగ్యమ్మ అని టీడీపీ సీనియర్ నాయకుడు లోకానందరెడ్డి అన్నారు. నెహ్రూనగర్ గ్రామానికి చెందిన టీడీపీ నియోజకవర్గ నాయకుడు, నందికొట్కూరు మార్కెట్ యార్డు మాజీ డైరెక్టరు బండి జయరాజు, అనంతపురం జిల్లా రిజిస్ట్రారు బండి శ్రీనివాసులు తల్లి బండి భాగ్యమ్మ దశదిన కార్యక్రమం గురువారం సాయంత్రం ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు, వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు భాగ్యమ్మ చిత్రపటాని పూలమాలు వేసి నివాళులర్పించారు.

బంగారం స్వాహా?

నంద్యాల టౌన్ సెప్టంబరు 25(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని టూటౌన్ పరిధిలో ఒక ప్రముఖ జువెలరీ దుకాణంలో సుమారు ఐదు కేజీల బంగారం స్వాహా చేసినట్లు సమాచారం. ఆ దుకాణంలో ఇటీవల ఆడిట్ జరగడంతో విషయం బయటపడ్డట్లు తెలిసింది. ఈ ఆడిట్‌లో ఓ ఉద్యోగి బంగారాన్ని, ఆభరణాలను దశలవారీగా తీసు కెళ్లినట్లు సమాచారం. యాజమాన్యాన్ని విషయం అడగగా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సీఐని వివరణ కోరగా దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. కాగా పద్మావతీనగర్‌లో నివాసం ఉండే వ్యక్తి రెండేళ్లుగా ఆ దుకాణంలో పని చేస్తున్నాడు. అతనిపై అనుమానంతో బంధించినట్లు సమాచారం. దీంతో ఆయన తండ్రి గురువారం దుకాణం వద్ద నిరసన తెలిపారు.

కళారంగానికి తోడ్పాటు అందిస్తాం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పేద కళాకారులకు అండగా ఉండటంతో పాటు కళారంగం అభివృద్ధికి తన వంతు ప్రోత్సాహం అందిస్తాం అపి టీడీపీ వైయస్సార్ నగర్ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని టౌన్‌హాలులో దసరా ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో గల కళాకారులకు ఏకపాత్రాభినయంపై పోటీలు నిర్వహించారు. బుగ్గరాముడు హాజరై కళాకారులకు రూ.10వేల సహాయం అందజేశారు.

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

కొత్తపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కొత్తపల్లి మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.93,23,540 మంజూరైనట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆమె వివరాలు తెలిపారు.

అమ్మవారి దర్శనం.. సకల పాప హరణం

నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలోని శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయాలు, మండపాల్లో అమ్మవారు గురువారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



నంద్యాల: కాళికాంబ ఆలయంలో లలితాదేవి అలంకారంలో అమ్మవారు



బ్రహ్మనందీశ్వర ఆలయంలో అన్నపూర్ణాదేవి, కూష్మాండ దేవిగా..

నంద్యాల: బాలాజీకాంప్లెక్ కల్యాణ మండపంలో పంచముఖి గాయత్రీ దేవిగా...





ఆత్మకూరు: కూష్మాండ దుర్గాదేవీ అలంకరణలో వాసవీ అమ్మవారు ..



తోటగేరిలో మహాలక్ష్మీదేవీ అలంకరణలో చౌడేశ్వరీదేవి..



పాణ్యం: కాత్యాయని దేవి అవతారంలో..



పాణ్యం : ఆలమూరులో కాత్యాయని అలంకారంలో అమ్మవారు



మిడుతూరు: కాత్యాయని దేవిగా..



నెహ్రూనగర్‌లో కాత్యాయని దేవి అలంకరణ



జూపాడుబంగ్లా: అన్నపూర్ణదేవిగా సరస్వతీ..



బండిఆత్మకూరు: అన్నపూర్ణదేవిగా ఉమామహేశ్వరీ దేవి



కొత్తపల్లి: కాత్యాయని అలంకరణలో కొలనుభారతీ దేవి..

తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు తోడ్పాటు

● బాధితులకు ఆర్థికసాయం అందజేత



అనాథ బాలబాలికలతో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్: కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకంతో అండగా నిలుస్తోందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో స్త్రీ శిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణ శాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన తొమ్మిది మంది పిల్లలను గుర్తించామన్నారు. ఒక్కొక్కరికీ కేంద్రం నుంచి రూ.10లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు కలిపి మొత్తం రూ.20లక్షల ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు. బాధిత పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్ సాధికారత కోసం 'వాత్సల్య' కింద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. పిల్లలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా బాలల సంరక్షణ విభాగం లేదా ఐసీడీఎస్ అధికారులను సంప్రదించాలని కోరారు. నందికొట్కూరు మండలం వడ్డెమాన్‌కి చెందిన రాజుకు రూ.1.5లక్షల విలువైన వీడియో కెమెరా, శ్రీశైలం మండలం సున్నిపెంటకు చెందిన సబీ సుల్తానా బీఫార్మసీ కోర్సుకు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు.

నంద్యాల రూరల్ : ఏక్‌దిన్.. ఏక్‌గంట.. ఏక్ సాత్ కార్యక్రమంలో పురస్కరించుకుని నంద్యాల మండల పరిధిలోని గ్రామాల్లో ఆయా అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అయ్యలూరులో తహసీల్దారు శ్రీనివాసులు పరిసరాలను శుభ్రం చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

నందికొట్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం స్వచ్ఛతా హి సేవా-2025 కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు మున్సిపాల్టీ పరిధిలోని గాంధీ మెమోరియల్ హై స్కూల్‌లో ఏక్‌దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని చెత్తను తొలగించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బేబి, కౌన్సిలర్లు, మున్సిపాల్టీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది:పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ మహమ్మద్ దౌలా అన్నారు. గురువారం మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో చెత్తను గ్రామ పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో తొలగించారు. ఇందులో ఎంపీడీఓతో పాటు ఈవోఆర్డీ నాగేంద్రుడు పాల్గొని శ్రమదానం చేశారు.

నంద్యాల టౌన్: పచ్చదనంతోనే ఆరోగ్యం.. పరిశుభ్రత వస్తాయని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ ఆధ్యక్షతన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణ శివారులోని సమ్మర్ స్టోరేజ్ పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే వారి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏపీ హౌసింగ్ వారు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మిడుతూరు : మండల కేంద్రం మిడుతూరు బస్టాండు ఆవరణంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుశేన్, ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, గ్రామ సర్పంచు జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాత రమేష్ రెడ్డి, ఈవోఆర్డీ సంజన్న, పీఆర్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్ సింగ్, ఏఎస్ఐ సుబ్బయ్య ఏపీవో సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం అని, ఇందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవా - 2025 కార్యక్రమాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అలాగే గౌడ్‌సెంటర్ ప్రాంగణంలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవన్, ఏఈలు సాజిద్, ఓబులేసు, మెప్మా సీఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు అనుసంధానాన్ని పకడ్బందీగా చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటరు అనుసంధాన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 2002 స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు లిస్టు ఆధారంగా అప్పట్లో 35ఏళ్లు పైబడిన ఓటర్లను గుర్తించి 2025 ఓటరు జాబితాతో అనుసంధానం చేసి సదరు ఓటరు వివరాలను మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

సాగు ఖర్చు తగ్గించుకోవాలి

● కేవీకే శాస్త్రవేత్త సుధాకర్

కొత్తపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులూ పంటల సాగుపై అవగాహన లేక ఇష్టానుసారంగా ఖర్చు చేయడం వల్ల పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, బాల్‌రాజులు సూచించారు. గురువారం కొత్తపల్లిలోని వెలుగు కార్యాలయంలో మండల వ్యవసాయాధికారిని అమీరున్నీసా భేగం ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో వ్యవసాయ శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ రైతులు భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టి సాగు ఖర్చు తగ్గించుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు కృష్ణమూర్తి, రవిగౌడు, ఏపీఎం పుల్లయ్య, వెలుగు సీసీ నరసింహులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విజేతల సభలో ఎమ్మెల్యే బుడ్డా



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మెగా డీఎస్సీ విజేతకు నియామక పత్రాలను అందజేసేందుకు అమరావతిలో గురువారం ఏర్పాటు చేసిన సభకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాలోకేశ్‌ను కలిశారు. అదేక్రమంలో శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన డీఎస్సీ విజేతలను అభినందించి వారికి నియామక పత్రాలను అందజేశారు.

సాగులో మెలకువలు పాటించాలి

● నంద్యాల వ్యవసాయ శాస్త్రవేత్త బాలాజీ నాయక్



వరి పంటను పరిశీలిస్తున్న నంద్యాల వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొత్తపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధిస్తారనీ నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, వెంకటరమణ, రవిప్రకాష్ రెడ్డి సూచించారు. గురువారం వారు స్థానిక వ్యవసాయాధికారి అమీరున్నిసాబేగంతో కలిసి మండలంలోని నందికుంట, దుద్యాల, కొత్తపల్లి గ్రామాల్లో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, మినుము, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త బాలాజీనాయక్ మాట్లాడుతూ వరి పంటలో ఆకు ఎండుతెగులు ఉన్నట్లు గుర్తించామనీ, తెగులు మరింత వ్యాప్తి చెందకముందే ప్లాంటోమైసిన్ 200 గ్రాములు, కాపర్ హైడ్రాక్సిడ్ 400 గ్రాములు ఒక ఎకరాకు 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేసుకోవలన్నారు. వర్షాల వల్ల పంట పొలాల్లో నీరు నిల్వ ఉంటే కాలువల ద్వారా బయటకు పంపించాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రవక్త జీవిత విశేషాలపై కవి సమ్మేళనం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో నంద్యాల నవభారత్‌స్కూల్ నందు మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలపై తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో కవి సమ్మేళనం గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రఫీ, కార్యద ర్శి మాబుబాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో కవులు మహమ్మద్ ప్రవక్త ఆదర్శమూర్తి, మహమ్మద్ ప్రవక్త జీవనం అందరికీ ఆదర్శం అని కొనియాడారు. మురసం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమద్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సుగుణాలు, నడవడికపై అందరు ప్రభావితులై ఇస్లాంవైపు ఆకర్షితులయారన్నారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల విద్యాధికారి అబ్దుల్ కరీం, నవభారత్ హుస్సేన్, పలువురు సాహితీ వేత్తలు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార సంస్థల నిర్వహణపై అవగాహన సదస్సు

పాణ్యం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో వ్యాపార సంస్థల నిర్వహణపై గురువారం సివిల్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ ఎన్ఎస్ఐసీ టెక్నికల్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ మేనేజరు అబ్దుల్ ఖాదర్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ కార్యక్రమం భారత ప్రభుత్వంచే స్పాన్సర్ చేసినట్లు హెచ్‌వోడీ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఖాదర్ పారిశ్రామిక రంగంలో అవకాశాలు, పరిశ్రమల్లో నైపుణ్యాలు, చిన్న తరహా వ్యాపారాల ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ టి.శాంతల, మెకానికల్ హెచ్‌వోడీ తిరుపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

శాంతిరాం ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌చెట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమంతప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విచ్చలవిడిగా మందులు వాడకుండా అవగాహన కల్పించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం : సీడీపీవో



మాట్లాడుతున్న సీడీపీవో మంగవల్లి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని నందికొట్కూరు ఐసీడీఎస్ సీడీపీవో మంగవల్లి అన్నారు. మండలంలోని తరిగోపుల గ్రామంలోని అంగన్‌వాడీ-3 కేంద్రంలో స్వస్తినారీ స్వస్తిపరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటీ పడావో బేటీ బచావో అనే నినాదాన్ని అందరం అమలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఉప్పు, చెక్కర, నూనె వాడకం తగ్గించాలని, లేకపోతే అనారోగ్యాల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నిర్మలమ్మ, ఆశీర్వాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, తులశమ్మ, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ

నందికొట్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు సబ్ జైలును జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి బి. లీలా వెంకటశేషాద్రి గురువారం తనిఖీ చేశారు. స్థానిక ఉపకారాగారంలోని ఖైదీలతో ముచ్చటించారు. అనంతరం జైలులో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. 70 సంవత్సరాలు పైబడిన వారు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. సమస్యలు ఉంటే మండల న్యాయ సేవా సంస్థ ద్వారా గాని, ఉచిత ఆన్‌లైన్ నెంబరు 15100 ద్వారా గానీ తెలుపవచ్చునన్నారు. జైలు సూపరింటెండెంట్ రఘునాథ్ రెడ్డి, ప్యానల్ న్యాయవాది కె. వెంటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ కె.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డీఎల్‌పీవో రాంబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

చిరుతిళ్లకు దూరంగా ఉండాలి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు బయటి చిరుతిళ్లకు దూరంగా ఉండాలని సీడీపీవో చంద్రకళ తెలిపారు. గురువారం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసంలో భాగంగా ఊబ కాయమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుతిళ్లు తినడం ద్వారా ఊబకాయమ్ వచ్చే అవకాశముందన్నారు. కావున పెద్దలు తినకపోవడంతో పాటు పిల్లల కూడా చిరుతిళ్లు తినకుండా శ్రద్ధ వహించాలన్నారు. వాటికి బదులుగా పండ్లు, కూరగాయాలు తీసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

మెరిసిన మిరాయి

● ఆత్మకూరులో హీరోయిన్ రితికా సందడి



ఆత్మకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం మిరాయి మూవీ ఫేమ్, హీరోయిన్ రితికా నాయక్ సందడి చేశారు. పట్టణంలో స్టేట్ బ్యాంకు సమీపంలో ఏర్పాటైన ఓ సెల్‌ఫోన్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. ఆ తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై చేరుకుని ప్రజలకు అభివాదం చేశారు. స్టెప్పులు వేసి ఆహ్లాదపరిచారు. అంతకుముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిరాయి చిత్రం ఘన విజయాన్ని అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. వరణ్ తేజ్‌తో కలిసి కొత్త సినిమా తీయనున్నట్లు వెల్లడించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కన్యకాపరమేశ్వరి ఆలయంలో చండీ హోమం



చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

చాగలమర్రి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగలమర్రిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేద పండితుడు నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో దంపతులతో చండీహోమం నిర్వహించారు. అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముత్యాలపాడు గ్రామంలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బనగానపల్లె, డోన్, ఆళగడ్డ నియోజకవర్గాల పరిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నాలుగో రోజు గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. (ఆంధ్రజ్యోతి-నెట్‌వర్క్)




శిరివెళ్లలో కాత్యాయనిదేవిగా..



దొర్నిపాడులో బాలత్రిపుసుందరిగా..



ప్యాపిలిలో గాయత్రిదేవిగా..



బేతంచెర్లలో కాత్యాయనిదేవిగా..



రుద్రవరంలో ధనలక్ష్మీదేవిగా..



అవుకులో సంతానలక్ష్మీదేవిగా





ఉయ్యాలవాడ, సంజామలలో కాత్యాయనిదేవిగా



ఆళ్లగడ్డలో బాలత్రిపురసుందరి దేవిగా..



డోన్‌లో కాత్యాయనిదేవి అలంకారంలో అమ్మవారు



ముత్యాలపాడులో గాయత్రీదేవిగా..



తిమ్మనాయినిపేటలో గజలక్ష్మీదేవిగా..



కోవెలకుంట్లలో బాలత్రిపురసుందరీ దేవిగా అమ్మవారు

వాసవీమాత ఆలయంలో బీసీ రాజారెడ్డి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయాన్ని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆర్యవైశ్య ప్రపంచ మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు గాథంశెట్టి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం, భరతుడు, ఆర్యవైశ్యులు బీసీ రాజారెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేసిన రాజారెడ్డి అన్నపూర్ణమాత అలంకారంలో దర్శనమచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు ఎత్తి వేయాలి : ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గురువారం అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆహోబిలం ప్రాంతంలో 18 మంది యువకులపై తప్పుడు కేసులు నమోదు నమోదు చేశారని, దాన్ని దర్యాప్తు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు.

ఊర్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ హనుమంతనాయక్

కోవెలకుంట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు సొంతూరుకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటిలో బంగారు ఆభరణాలు ఉంచరాదన్నారు. ఒకవేళ బంగారు ఉంటే బ్యాంకుల్లో దాచుకోవాలన్నారు. ఇంటికి తాళం వేసి బాత్‌రూములు, కిటికీల్లో బీగం చేతులు ఉంచరాదన్నారు. బంగారు ఇంట్లోనే ఉంటే ఇంటికి ఒకరిని కాపలా ఉంచి పోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు మీకు అనుమానం వచ్చినప్పుడు వెంటనే డయల్ 112కు కానీ, స్థానిక పోలీసులకు సెల్‌నెంబరు కానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఏనుగమర్రిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

ప్యాపిలి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ యువనాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురు వారం ఆయన మండలంలోని ఏనుగమర్రి, పెద్దపూదిళ్ల గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ అర్హు లైన వారికి ప్రభుత్వం పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, మోపూరి రామక్రిష్ణ, సీమ సుధాకర్‌రెడ్డి, ఖాజాపీర్, సుదర్శన్, కుమ్మరి సుధాకర్, రాంభూపాల్, శంకర్, కదిరెడ్డి, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణగౌడు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుపై నమ్మకం ఉంది: టీడీపీ

డోన్ టౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై నమ్మకం ఉందని రాష్ట్ర బోయ వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలో ఆయన డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్ నాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై మంత్రి కాల్వ శ్రీనివాసులు అసెంబ్లీలో చర్చించడంతో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి మిద్దెపల్లె గోవిందు, ఉడుములపాడు నాగేంద్ర పాల్గొన్నారు.

కామినేనిపల్లెలో డెంగీ కేసు నమోదు

శిరివెళ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామినేనిపల్లె గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్లు సబ్ యూనిట్ అధికారి వెంక టేశ్వరరెడ్డి, శిరివెళ్ల పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు డెంగీ వ్యాధి సోకిన వ్యక్తి ఇంటి చుట్టుపక్కల ఉన్న వంద ఇళ్లలో పైరెత్రం ద్రావణాన్ని గురువారం పిచికారి చేయిం చారు. పంచాయతీ కార్యదర్శి వెంకట రాయుడు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో వైద్యం అందించండి

రుద్రవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువులకు సకాలంలో వైద్యం అందించాలని పశువైద్యసిబ్బందిని జిల్లా పశువైద్యశాఖ సంచాలకుడు గోవిందనాయక్ ఆదేశించారు. గురువారం రుద్రవరంలో శిరివెళ్ల - రుద్రవరం మండలాలకు చెందిన పశువైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెయ్యదూడలకు లింగ నిర్ధారిత ఎద సూదులను కచ్చితంగా వేయాలన్నారు. డిప్యూటీ డైరెక్టరు రమణయ్య, సాంకేతిక సహాయ సంచాలకుడు సునీల్, సహాయ సంచాలకుడు సుభాన్‌బాషా, పశువైద్యుడు మనోరంజన్ ప్రతాప్ పాల్గొన్నారు.

సంత మార్కెట్లో శ్రమదానం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంత మార్కె ట్లో అధికారులు శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. గురు వారం ఏక్‌దిన్ ఏక్ గంట ఏక్‌సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో ప్రసాదరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళిగౌడ్‌లు పంచాయతీ సిబ్బందితో కలిసి సంత మార్కెట్లో చీపుర్లు పట్టి చెత్తను ఊడ్చారు. సర్పంచ్ శివరాముడు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు.